నంబులపూలకుంటలో పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వి.రత్న

షాపుల వద్ద మద్యపానం... డ్రోన్లకు కనిపించని వైనం..!

ఆరుబయట మద్యం తాగే వారిని డ్రోన్లతో పోలీసులు వెంటాడుతున్నారు. ఎక్కడైన పొలాల వద్ద మద్యం తాగుతుంటే వారిని పరుగెత్తించి మరీ డ్రోన్లలో చిత్రీకరిస్తున్నారు. ఈ వీడియోలను బహిర్గతం కూడా చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఆరుబయట మద్యంపానం చేసే వారిని వెంటాడే పోలీసులకు.. మద్యం దుకాణాల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌ల్లో సాగుతున్న మద్యంపానం కనిపించకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఇక మద్యం సేవించే వారిని విపరీతంగా తనిఖీలు చేపట్టి దాడులు చేస్తున్న ఘటనలు కూడా ఇటీవల నెలకొన్నాయి. ఇంతలా మద్యం సేవించే వారిపై ప్రతాపం చూపుతున్న ఖాకీలకు అనధికారికంగా నడుస్తున్న అమ్మకాలు... షాపుల వద్ద తాగుతున్న సిత్రాలు కనిపించడం లేదా అన్న ఆరోపణలు పెద్దఎత్తున వెల్లువెత్తున్నాయి.

◆ ఆరుబయల్లో వెంటాడుతున్న ఖాకీలు
◆ అనధికార పర్మిట్ రూమ్‌లపై మౌనం
◆ షాపు పరిసరాల్లోనే మద్యపానం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ నెల నుంచి కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అంతకు మునుపున్న ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రయివేటుకు మద్యం అమ్మకాల బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించింది. పెద్దఎత్తున పోటీలు పడి మద్యం వ్యాపారులు టెండర్లు దక్కించుకున్నారు. ఇందులో అత్యధికంగా అధికారపార్టీ ముఖ్య నేతలే ఉండటం గమనార్హం. మద్యం పాలసీలో నాణ్యమైన మద్యంతోపాటు అన్ని రకాల బ్రాండ్స్‌ను అందుబాటులో ఉంచుతామని ప్రభుత్వం చెప్పింది. కొత్త మద్యం పాలసీ ప్రకారం అనంతపురం జిల్లాలో మొత్తం 136 మద్యం దుకాణాలున్నాయి. ఇందులో జిల్లా కేంద్రమైన అనంతపురం నగరంలోనే 41 ఉన్నాయి. ఇందులో అత్యధికంగా నేతలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ మద్యం దుకాణాల్లో చాలా వాటిల్లో పర్మిట్ రూములు అనధికారికంగా నడుస్తున్నాయి. నగరం నడిబొడ్డునున్న మద్యం దుకాణాల్లో ఇలాంటివి చాలానే ఉన్నాయి. ఈ దుకాణాలను రెగ్యులర్‌గా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వ నిబంధనలున్నాయి. మరి ఈ దుకాణాలను అధికారులు తనిఖీలు చేశారా లేదాన్నది చూడాల్సి ఉంది.

ఆరుబయట మద్యం సేవిస్తే డ్రోన్లతో తనిఖీలు

ఎక్కడైనా మద్యం ప్రియులు ఆరుబయట మద్యం సేవిస్తే డ్రోన్లతో పరిశీలించి మరీ జరిమానాలను పోలీసులు విధిస్తున్నారు. అంతేకాకుండా అను నిత్యం వాహన తనిఖీల్లోనూ మద్యం ప్రియులను తనిఖీలు చేపట్టి జరిమానాలు విధిస్తున్నారు. ఈ జరిమానాలు విధించే క్రమంలో ప్రశ్నించిన ఒక యువకుడిని ఇటీవల అనంతపురం నగరం నడిబొడ్డున టవర్‌క్లాక్ వద్ద పోలీసులు బూటుకాలితో తన్నిన ఘటన సోషియల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ రకంగా కఠినంగా వ్యవహరించడాన్ని ఒకింత సమర్థించినా, అమ్మే చోట జరిగే ఉల్లంఘనలపై మాత్రం మెతకవైఖరి ఎందుకన్న ప్రశ్నలు సామాన్యుల నుంచి ఉత్పన్నమవుతుండటం గమనార్హం. మద్యం షాపుల వద్ద యథేచ్ఛగా మద్యపానం చేస్తున్నా పోలీసులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. డ్రోన్ల ద్వారా ఆరుబయట మద్యం చేసే వారిపై చర్యలు తీసుకోవడం మంచిదే అయినా.. అదే స్థాయిలో మద్యం షాపుల వద్ద అనధికార పర్మింట్ రూమ్‌ల వద్ద మద్యపానాన్ని కూడా అదే స్థాయిలో నియంత్రించాలనే డిమాండ్ ప్రజల నుంచి విన్పిస్తోంది.

పౌర హక్కులపై అవగాహన అవసరం

ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-కదిరి టౌన్

పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. పట్టణంలోని నిజాంవలి కాలనీలో శనివారం పౌర హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పౌరులందరూ కలిసి మెలిసి జీవిద్దాం, మన హక్కులను మనం కాపాడుకుందాం.. జీవితాన్ని ఆనందంగా గడుపుకుందాం' అని పిలుపునిచ్చారు. పిల్లలు చెడు వ్యసనా లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు బాల్య వివాహాలను అరికట్టాలని, పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. పలువురు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ ప్రజాశక్తి-2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్డీవో వెంకట సన్యాసి శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ పోలప్ప, సిఐలు నారాయణరెడ్డి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

యోగివేమన సమాధిని సందర్శించిన ఎస్పీ

గాండ్లపెంట : మండలంలోని కటారుపల్లిలో ఉన్న యోగి వేమన సమాధిని శనివారం జిల్లా ఎస్పీ వి.రత్న సందర్శించారు. ఆమె యోగి వేమనసమాధిపై పూలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతులను అడిగి యోగి వేమన చరిత్రను తెలుసుకున్నారు. వేమన పద్యాలు చదివి పరిసరాల ప్రాంతాలను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వీరనారాయణస్వామి, సిఐ నాగేంద్ర, ఎస్ఐ మక్బూల్‌బాషా, ఎఎస్ఐ రంగా, సిబ్బంది ఉన్నారు

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి : ఎస్పీ

నంబులపూలకుంట : పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే ప్రతి ఫిర్యాదుదారునికి న్యాయం చేయాలని ఎస్పీ వి.రత్న ఆదేశించారు. ఆమె స్థానిక స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను స్వీకరించి వారికి న్యాయం చేయ చేసినప్పుడే పోలీసుల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. పోలీసు శాఖపై ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయవద్దని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ శివనారాయణస్వామి, సిఐ నాగేంద్ర, ఎస్ఐలు వలిబాషా, నరసింహుడు, మక్బూల్ బాషా, ఎఎస్ఐ కిషోర్‌రెడ్డి, పోలీసులు నరసింహమూర్తి, రమణ, అమల ఉన్నారు.

తనకల్లు : ఎస్పీ రత్న స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాలకు వెళ్లి ప్రజలకు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో అవాంఛనీయ, అసాంఘిక ఘటనలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత గురించి తెలిపారు. ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించి ప్రమాదాలను అరికట్టాలని ఎస్ఐ గోపిని ఆదేశించారు. ఎస్పీ వెంట కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి, సిఐ నాగేంద్ర ఉన్నారు.

వైసిపి నిరసన అట్టర్ ప్లాప్ : ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత

విద్యుత్ ఛార్జీలపై ఇటీవల వైసిపి చేపట్టిన నిరసన కార్యక్రమం అట్టర్ ప్లావ్ అయిందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. ప్రజల నుంచే కాకుండా సొంత పార్టీ నాయకులు కూడా ఈ నిరసనను పట్టించుకోలేదన్నారు. రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలోని తన క్యాంప్ కార్యాలయం లో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. జగన్ గుట్టుచప్పుడు కాకుండా ఈఆర్‌సీకి ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలు పంపారని, ఆ ప్రతిపాదనలు వచ్చిన 90 రోజుల్లోనే వాటిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా ఉద్దేశ పూర్వకంగా ఎన్నికల దాకా ఆపారన్నారు. వైసిపి చేసిన పాపాలే ప్రజలను వెంటాడుతుండగా కూటమి ప్రభుత్వమే విద్యుత్ ఛార్జీలను పెంచిందని దుష్ప్రచారం చేస్తూ రోడ్డెక్కడం సిగ్గుచేటన్నారు. వైసిపి అధ్యక్షుడు జగన్‌కి గానీ, ఆ పార్టీ నాయకులకు గానీ విద్యుత్ ఛార్జీల గురించి మాట్లాడే నైతికత లేదన్నారు. అధికారంలో ఉండగా రైతులను విస్మరించడంతో పాటు విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన వైసిపి అధినేత జగన్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. సిఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పారని ఇప్పటికీ దానికి కట్టుబడి ఉన్నారన్నారు. వైసిపిచేసిన పాపాలే ప్రజలను వెంటాడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వానికి విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన, అవసరం రెండూ లేవన్నారు. ఇకనైనా వైసిపి నాయకులు, వారి కరపత్రిక విష ప్రచారం మానకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే సునీత హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం రాజీలేని రాజీలేని పోరాటాలు చేస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి తెలిపారు. శనివారం హిందూపురం పట్టణంలోని వెంకటేశ్వర ఐటిఐ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించిన అనంతరం అనంతరం బాబావలి మాట్లాడుతూ 1970లో కేరళ రాష్ట్ర రాజధాని త్రివేండ్రంలో అధ్యయనం – పోరాటం నినాదంతో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యా సమస్యల పరిష్కారం కోసం నిర్విరామ పోరాటాలు చేస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే నిర్ణయాలు తీసుకుంటున్నాయని, వీటికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పోరాటం సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, పవన్, హుస్సేన్, అఫ్రిద్, హుస్సేన్, మంజునాథ్, మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యసాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్యసాయి విద్యాసంస్థ శ్రీమతి ఈశ్వరమ్మ హైస్కూల్లో విద్యను అభ్యసించడానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ జానకి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జనవరి 2025 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు ఆన్ లైన్ ద్వారా ఆరేళ్లు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 లోపల దరఖాస్తులు సంబంధిత పాఠశాలలో సమర్పించాలని తెలిపారు. రసీదు రుసుం వంద రూపాయలు చెల్లించి వాటికి జనన ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ, ఆధార్ ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలు జత చేసి సమర్పించాలన్నారు. అర్హులైన విద్యార్థులందరూ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

మాలధారులకు అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వెలసిన అయ్యప్ప స్వామి సన్నిధానంలో శనివారం మున్సిపల్ కౌన్సిలర్ మద్దన జయప్ప సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దాత మద్దన జయప్ప కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, సభ్యులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్స్ ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానం

ధర్మవరం టౌన్ : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ధర్మవరం పురపాలక సంఘంలో సర్వీస్ ప్రొవైడర్స్ అభ్యర్థుల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, గీజర్, టీవీ, ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, వాటర్ ప్యూరిఫైయర్ మరమ్మతులు చేసేవారు, బ్యూటీషియన్(మగ, మహిళలు) సేవలందించే వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.అభ్యర్థులు జనవరి 5వ తేదీ లోపు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మేళా కూడా నిర్వహిస్తామని తెలిపారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై రేపు వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

సాక్షాత్తు పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా కేంద్రం హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఈ నెల 30వ తేదీ వామపక్షాల ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ పార్టీల నాయకులు తెలిపారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం సిపిఎం పట్టణ కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ స్ఫూర్తి బాటలో నడిచే కోట్లాది మందిని అమిత్ షా అవమానించారన్నారు. తక్షణమే అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించి, దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం దేశంలో రాజ్యాంగానికి వ్యతిరేకంగా అనేక అంశాలను ప్రేరేపిస్తుందని, అందుకు మణిపూర్ సంఘటనే ఉదాహరణ అన్నారు. మణిపూర్‌లో ఏడాదికి పైగా జరుగుతున్న తీవ్ర హింసాత్మక పరిస్థితులను అదుపు చేయడంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలనే దురుద్దేశ్యంతో మోదీ, అమిత్ షా నేతృత్వంలో మతవాదాన్ని నెత్తికెత్తుకుని బిజెపి పాలకులు వ్యవహరిస్తున్నారు. జమిలి ఎన్నికల పేరుతో ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి కేంద్రం పెత్తనం చెలాయించేందుకు చేస్తున్న మోదీ సర్కార్ ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, సిఐటియు నాయకులు ఆదినారాయణ, రైతు సంఘం కార్యదర్శి మారుతిప్రసాద్, ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు రాజా, సిపిఐ నాయకులు ముత్యాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

కార్మిక చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-బుక్కపట్నం

కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ విమర్శించారు. స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో శనివారం నిర్వహించిన సిఐటియు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. కనీస వేతనాలతో పాటు అన్ని ప్రయోజనాలను కల్పించాలన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చి అధికారం చేపట్టాక తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తే రాబోయే రోజుల్లో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐటియు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా బ్యాల్ల అంజి, కో కన్వీనర్లుగా మణెమ్మ, మంజుల, రామదాసు, 11 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఓబిరెడ్డి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతలో అధికారులు, ఉపాధ్యా యు లు ఎక్కడా రాజీ పడొద్దని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆదేశించారు. ఆయన శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం తయారీ విధానం, వంట సామగ్రి, వంటశాలలో పరిశుభ్రత, పాఠశాలను పరిశీలించారు. భోజనంలో ఏమైనా మార్పులు చేయాలా అని ఎంఇఒ భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు వివిఎం.పాండురంగప్ప, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాగరాజు, కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, రవికుమార్, కౌన్సిలర్లు బలరాం ఉన్నారు.

బిటిపికి నిధులు తెస్తాం

◆ ఎత్తిపోతలతో సాగుకు కృష్ణా జలాలు
◆ ఎంపీ అంబికా, విప్ కాలవ, ఎమ్మెల్యే అమిలినేని
◆ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం, గుమ్మఘట్ట

రాయదుర్గం, కళ్యాణ దుర్గం నియోజకవర్గం రైతులకు జీవనాడిగా ఉన్న భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాల ఎత్తిపోతల పథకం చేపట్టేందుకు అవసరమైన నిధులను తీసుకొస్తామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. బిటి ప్రాజెక్టు వద్ద ఆయకట్టు సాగునీటి సంఘం రైతుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. రాష్ట్ర మత్స్య అభివద్ధి సంస్థ ఏర్పాటుచేసిన 6.48 లక్షల చేప పిల్లలను రిజర్వాయర్‌లోకి వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సంఘ సమావేశంలో ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బిటి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకానికి రూ.968 కోట్లు మంజూరు చేయగా కొంతమేర పనులు పూర్తి అయ్యాయన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పనులను చేపట్టేందుకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదన్నారు. తట్టెడు మట్టి కూడా ప్రాజెక్టు నుంచి ఎత్తలేదన్నారు. చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాక రాయదుర్గం నియోజకవర్గం పర్యటనకు వచ్చిన సందర్భంగ బిటి ప్రాజెక్టుకు కృష్ణా జలాల మళ్లింపు పథకానికి అవసరమైన నిధులు ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో పథకానికి అవసరమైన నిధులు తీసుకువస్తామన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో పది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.1.29 లక్షల కోట్ల భారం వేసారన్నారు. నేడు ఛార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలంటూ కపట నాటకం ఆడుతున్నాడని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని జగన్ అప్పుల ఊబిలో ముంచారన్నారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకు కాలువ వెడల్పు చేయడానికి ప్రభుత్వం 2000 కోట్ల రూపాయలు మంజూరు చేసి టెండర్లు పిలిచిందన్నారు. సాధ్యమైనంత త్వరగా వీటి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ సీజన్లో బిటిపి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడం అదష్టం అన్నారు. సాగునీటి పంపిణీ నష్టాలపై లెక్కలు వేసి ఎంత ఆయకట్టుకు సాగునీరు ఇవ్వగలరో లెక్కలు వేసి ఆ మేరకు నీటిని సరఫరా చేయాలన్నారు. పంట చేతికి వచ్చే దశలో ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సాగునీటి సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు సుభాన్ అధికారులతో సమన్వయంగా వ్యవహరించి ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అబ్దుల్ సమీర్, డి ఈ బలరాం, బ్రహ్మసముద్రం జడ్పిటిసి ప్రభావతి, సాగునీటి సంఘం అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి సుభాన్, గుమ్మగట్ట ఎంపీడీవో రామకృష్ణ, తహశీల్దార్ శ్రీనివాసులు, గుమ్మగట్ట టిడిపి మండల కన్వీనర్ గిరి మల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, రాయదుర్గం డి.హిరేహాల్, మండల కన్వీనర్లు హనుమంతు, హనుమంత రెడ్డి, జనసేన రాయదుర్గం నియోజకవర్గం ఇన్‌ఛార్జి కరేగౌడ్ర, మంజునాథ్ గౌడ్, మత్స్య పరిశ్రమ శాఖ అభివద్ధి అధికారి లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎంపిడిఒపై దాడి హేయం

పెనుకొండ ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన ఉద్యోగులు

ప్రజాశక్తి-పెనుకొండ

విధి నిర్వహణలో ఉన్న ఎంపిడిఒపై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని అధికారులు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండల ఎంపిడిఒ జవహర్‌బాబుపై దాడికి నిరసనగా ఎంపిడిఒ నరేష్‌కృష్ణ, తహశీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది శనివారం మధ్యా హ్నం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అధికారులు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై రాజకీయ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఉద్యోగుల పని చేస్తారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఉద్యోగులపై దాడులు చేస్తుంటే విధులు ఎలా నిర్వహించాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కపట్నం : గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై వైసిపి నాయకుల దాడిని ఖండిస్తూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న అధికారులపై వైసిపి నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. అధికారులపై దాడులు చేస్తే సహించేది లేదని, దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, ఈవోఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాధిక్‌అలీ, వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న రఘువీరారెడ్డి

మాజీ ప్రధాని అంత్యక్రియల్లో రఘువీరా

ప్రజాశక్తి-మడకశిర రూరల్

దేశ రాజధాని ఢిల్లీలో శనివారం నిర్వహించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల్లో సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి పాల్గొన్నారు. రఘువీరా మన్మోహన్‌సింగ్ పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్‌సింగ్ ప్రధాని ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా ఆయనను కలిసిన అనుభవాలను రఘువీరా గుర్తుచేసుకున్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలో నిర్వహించిన తారకరత్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం జరిగిన పోటీలో హిందూపు రం జట్టుపై మడకశిర జట్టు 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్ అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో మంజునాథ్‌రెడ్డి 71, హరి 59 పరుగులు చేశారు. మడకశిర జట్టును యువ న్యాయవాది త్రిలోక్, డాక్టర్ రవిశంకర్, సాయినాథ్, భక్తర్, అల్తాఫ్‌బాషా, రాజా అభినందించారు.

బాధితురాలికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-నల్లచెరువు

కదిరి పార్టీ కార్యాలయంలో బాధితురాలు స్వాతికి చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

మండలంలోని ఓరువాయి గ్రామానికి చెందిన స్వాతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడు తుండేది. ఈ విషయాన్ని స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆమెకు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 2 లక్షలు మంజూరు చేయించారు. దీంతో శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కందికుంట కార్యాలయంలో స్వాతికి రూ. 2 లక్షల చెక్కును జిల్లా చేనేత ఉపాధ్యక్షులు శ్రీరాములు అందజేశారు. కార్యక్రమంలో ఓరువాయి గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

జనవరి 11వ తేదీ వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని వడ్డెర సంఘం నాయకులు కోరారు. వారు శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న ప్రాణాలు తెగించి దేశం కోసం పోరాడిన తెలిపారు. బ్రిటీష్ మిలిటరీని ముప్పు తిప్పలు పెట్టి వీర మరణం పొందారన్నారు. కార్యక్రమంలో అంజి, శంకర్, దివాకర్, అనిల్, శివశంకర్, రమేష్, నరేంద్ర, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

పక్కాగా వంద రోజుల ప్రణాళిక అమలు

ప్రజాశక్తి-అగళి



ఎంఇఒ చంద్రశేఖర్‌నాయుడు

పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం మెరుగుపరిచేందుకు రూపొందించిన వంద రోజుల ప్రణాళికను మండలంలోని ప్రతి పాఠశాలలో పక్కాగా అమలు చేయాలని ఎంఇఒ చంద్రశేఖర్‌నాయుడు ఆదేశిం చారు. ఎంఇఒ కార్యాలయంలో శనివారం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఇఒ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించేలా సన్నద్ధం చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నెలాఖరు లోపు అన్ని సబ్జెక్టుల్లో పాఠ్యాంశాలు పూర్తి చేసి జనవరి 1వ తేదీ నుంచి రివిజన్ చేయాలని ఆదేశించారు. త్వరలో విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా సమావేశం నిర్వహించి విద్యార్థులు చదువుకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా సూచించాలన్నారు.

సొసైటీ ఓటర్లు ఈకేవైసీ చేసుకోవాలి:ఎంపిడిఒ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని గొట్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యకలాపాలు కంప్యూట రైజేషన్‌లో భాగంగా సొసైటీలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్క సభ్యుడు సంబంధిత సచివాలయా లకు వెళ్లి ఈకేవైసీ చేయించుకో వాలని ఎంపిడిఒ సాయి మనోహర్ సూచించారు. ఈకేవైసీ చేయించు కోకపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, తదితర ప్రయోజనాలు కోల్పోతారని తెలిపారు. కార్యక్రమంలో గొట్లూరు సొసైటీ కార్యాలయ వ్యక్తిగత ఇన్‌ఛార్జి కె.లీలావతి, సొసైటీ సిఇఒ ఎస్.నారాయణస్వామి పాల్గొన్నారు.

'పరీక్ష పే చర్చ'ను జయప్రదం చేద్దాం : డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు, బుక్కపట్నం

పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో జనవరిలో ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే 'పరీక్ష పే చర్చ'ను జయప్రదం చేయాలని డిఇఒ కిష్టప్ప, ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అందులో పాల్గొనేందుకు ముందుగా జనవరి 14వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్ష నిర్వహిస్తారన్నారు. 6 నుంచి 12వ తరగతి వరకూ చదివే అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరీక్షకు హాజరై అర్హత సాధిస్తే 'పరీక్ష పే చర్చ'కు ఎంపికవుతారన్నారు. ఆసక్తి ఉన్న వారు https://innovateindia1.mygov.inలో లాగిన్ అయి సమాచారం నింపాలన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి : ఎపి ఎస్‌టిఎ

ప్రజాశక్తి-మడకశిర

ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఎపి ఎస్‌టిఎ) జిల్లా అధ్యక్షులు డి.మారుతిప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని మలేరొప్పం ఎంపిపి పాఠశాలలో శనివారం అసోసియేషన్ కోశాధికారి ప్రదీప్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మారుతి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, జీవో-117 రద్దు చేయాలన్నారు. అనంతరం మండల అధ్యక్షు డిగా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశ్వత్థ నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా విష్ణు, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌గౌడ్, జాయింట్ సెక్రటరీగా నాగరాజాచారి, కోశాధికారిగా నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, నరసింహ మూర్తి, లక్ష్మీ నరసమ్మ, ఇమ్రాన్‌ఖాన్, 15 మంది కార్యదర్శులు ఎన్నుకున్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న అధికారిణి రమ

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక శాఖా గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సందర్శిం చారు. ఆమె పలు రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయ సెస్ బకాయిలు వసూలు చేసేందుకు కృషి చేయాలని శాఖా గ్రంథాలయ అధికారిని శాంతమ్మకు సూచించారు.

వ్యాధి నిరోధక టీకాలపై ఆరా

ప్రజాశక్తి-తలుపుల

వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారి నాగేంద్ర

మండలంలోని గర్భిణులు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకా (వ్యాక్సినేషన్) కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రనాయక్ తనిఖీ చేశారు. ఆయన పరిసరాల ప్రాంతంలో తల్లులు, గర్భిణులను అడిగి వైద్యసేవలపై ఆరా తీశారు. హెల్త్ కార్డులను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిఐఒ డాక్టర్ నాంగంద్రనాయక్ గర్భిణులు, తల్లులకు వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రామ్మోహన్, శంకరమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, ఎఎన్ఎం పుష్ప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల వ్యాప్తంగా టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఇప్పటి వరకూ 8 వేల సభ్యత్వాలు నమోదు చేసినట్లు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు తెలిపారు. శనివారం గుంటిపల్లి, మామిడికుంటక్రాస్ గ్రామాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసులు, వెంకటేష్, భాగ్యమ్మ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రోగుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు

ప్రజాశక్తి-ధర్మారం టౌన్

ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో సక్రమంగా వైద్య సేవలు అందించాలని, ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. ఆయన శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. ఓపి, వైద్యసేవలు, ఫార్మసీ, ఉద్యోగులు, తదితర వివరాలపై సూపరింటెండెంట్ మాధవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమర్జెన్సీ వార్డు, ఆసుపత్రిలోని వివిధ వార్డులు, ఐసిటిసి విభాగం, శవ పరీక్ష గది, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఏవో ఉదయభాస్కర్, డాక్టర్ నజీర్, డాక్టర్ హరిశ్రీనివాస్, ఏవో వాసుప్రకాష్, సిఐ జమీర్‌బాషా ఉన్నారు.

బుచ్చమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని గంటాపురం గ్రామ సమీపంలో బైపాస్ రోడ్డు పక్కన బుచ్చమ్మ దేవత ఆలయ నిర్మాణానికి శనివారం వేదపండితులు మంజునాథశర్మ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు భూమిపూజ చేశారు. గతంలో ఇక్కడ వేపచెట్టు కింద అమ్మవారికి పూజలు నిర్వహించేవారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో వేపచెట్టును తొలగించారు. ఆ స్థానంలో నూతనంగా దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో నెట్టెం రామకృష్ణ, బొల్లినేని వెంకటేష్, బొమ్మినేని శ్రీరాములు, సురేంద్రనాయుడు, అప్పస్వామి, నెట్టెం మల్లికార్జున, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆప్టా జిల్లా అధ్యక్షుడు నంబూరి వెంకటనాయుడు, వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ సంఘాల ఉపాధ్యాయులతో కలిసి ఎంఇఒ ఖాదర్‌వలికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ సర్వీస్ రిజిస్టర్ అప్‌డేషన్, టిడిఎస్, పని సర్దుబాటు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజనీకాంత్‌రెడ్డి, రాజశేఖర్, హరిప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ డిప్యూటీ తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

డిటి లక్ష్మీదేవిని సన్మానిస్తున్న ఆర్డీవో మహేష్

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తున్న గాజుల లక్ష్మీదేవి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఆత్మీయ సన్మానసభ నిర్వహించారు. లక్ష్మీదేవిని ఆర్డీవో మహేష్‌తో పాటు డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, అధికారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆర్డీవో ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహశీల్దార్లు నటరాజ, స్వర్ణలత, జమీనుల్లాఖాన్, ప్రసాద్, సురేష్‌కుమార్, లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విభిన్నం సిపిఎం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అన్ని రాజకీయ పార్టీల్లోల్లాగా పై నుంచి ఆదేశించడం వాటిని పాటించడం కాకుండా సమిష్టి నిర్ణయం మేరకు అమలు చేయడమన్నది సిపిఎం విధానం. అనంతపురం నగరంలో గత సోమ, మంగళవారం జరిగిన 14వ జిల్లా మహా సభను పరిశీలించినా ఇదే స్పష్టంగా కనిపిస్తుంది. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా చర్చించడం, నిర్ణయాలు చేయడం వాటిని అమలు చేయడం ఆ పార్టీలో కన్పించింది. రెండు రోజుల మహాసభ జరిగిన తీరు కూడా దీనిని స్పష్టం చేస్తుంది. మొదటి రోజు బహిరంగ సభ ఎంతో క్రమశిక్షణతో జరిగింది. వందలాది మంది కార్యకర్తలు జిల్లా నలుమూలల నుంచి విచ్చేశారు. అందరూ ఎర్ర జెండాలను చేతబట్టుకుని ఉత్సహంతో ఉరకలే శారు. అనంతరం జరిగిన సభలోనూ నాయకులు చేసిన ప్రసంగాలు అందరినీ ఆలోచింపజేశాయి. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వ రరావు, ప్రభాకర్‌రెడ్డిలు చేసిన ప్రసంగాలు ఎంతో అర్థవంతంగా సాగాయి. దేశంలో మతోన్మాద బిజెపి అనుసరిస్తున్న విధానాలను, రాష్ట్రంలో ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలు, సంక్షేమ కోతలపై వివరించారు. అనంతరం రెండు రోజులపాటు నగరంలోని ఎస్ఎన్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభలో మూడు సంవత్సరాల కాలంలో సిపిఎం చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించుకున్నారు వీటి ఫలితంగా వచ్చిన విజయాలతోపాటు, లోటుపాట్లపై నిర్దిష్టంగా చర్చించారు. పార్టీ బలాలు, బలహీనతలపైనా చర్చలు జరిగాయి. రాబోయే మూడు సంవత్సరాల కాలంలో వీటిని ఏ రకంగా అధికమించాలన్న దానిపై ప్రణాళికను రూపొందించారు. అన్నింటికంటే నూతన కార్యవర్గం ఎన్నిక ఎంతో ప్రజాస్వామ్యయుతంగా జరగడం గమనార్హం. ఎవరో చెప్పిన వారిని కాకుండా ఎన్నిక రూపంలో ప్రతినిధులు ఎన్నుకోవడం అంతర్గత ప్రజాస్వామ్యానికి నిలువుటద్దంగా నిలిచింది. మొత్తంగా రెండు రోజుల మహాసభలు ఎంతో ప్రజస్వామ్యయుతంగా సాగడమే కాకుండా జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపైనా చర్చించారు. వ్యవసాయ జిల్లాగానున్న ఇక్కడ ఆ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారనికి ఏ రకమైన పోరాటాలను రూపొందించాలని చర్చించారు. వెనుకబడిన ఈ ప్రాంతాభివృద్ధికి అత్యంత కీలకమైనది సాగునీటి సాధన. దీనికి ఏ రకమైన పోరాటాలు చేపట్టి ప్రభుత్వాలను దారిలో పెట్టాలన్న అంశాలను నిశితంగా చర్చించారు. ఈ చర్చల సారాంశాన్ని క్రోడీకరించి ఉద్యమకార్యాచరణను రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టాలని నిర్ణయించారు. వీటి అమలుపై రాబోయే రోజుల్లో పోరాటాలను రూపొందించే విధంగా జిల్లా కమిటీ కూర్పు సాగింది. మొత్తంగా రెండు రోజుల పాటు సాగిన మహాసభ ఇతర పార్టీలకు సిపిఎంకు మధ్యనున్న వైవిధ్యం ఏమిటన్నది స్పష్టం చేసిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ శివరాముడు

ఆటో డ్రైవర్లకు సిఐ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

పట్టణంలోని సొసైటీ ఆవరణలో శనివారం ఆటో డ్రైవర్లకు సిఐ శివరాముడు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవర్లు తప్పనిసరి లైసెన్సు, వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం నిబంధనలు పాటించాలన్నారు.

పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు పోలీసులు గ్రామాల బాట పట్టి పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి అమడగూరు, ధర్మవరం రూరల్ మండలాల్లో ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులు పల్లెనిద్ర నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. మహిళలు, బాలబాలికలపై జరిగే అకృత్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రజలందరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. అనంతరం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం చేపట్టారు.

ఏకలవ్య వాలంటీర్ల సమావేశం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక షిరిడీసాయిబాబా ఆలయంలో శనివారం ఏకలవ్య వాలంటీర్లకు సమావేశం నిర్వహిం చారు. సూపర్వైజర్ రాజేశ్వరమ్మ హాజరై వాలంటీర్లకు పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో నిరక్ష రాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. 8 ఏళ్ల పైబడిన పిల్లలను గుర్తించి పాఠశాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, మాతాజీలు, ఆచార్యులు గాండ్లపెంట, ఎన్‌పి.కుంట, కదిరి ఏకలవ్య వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీరామ భజన మందిరం, గోవింద మాలధారణ సేవా కమిటీ వారి ఆధ్వర్యంలో తేరు బజారులో ఉన్న ఆర్యవైశ్య కొత్త సత్రంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గోవింద మాల ధారణ సేవా కమిటీ గురుస్వామి, గౌరవ అధ్యక్షులు దేవతా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కళ్యాణోత్సవ వేడుకలు, స్వామివారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం 4 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా కమిటీ సభ్యులు అన్నం రామాం జనేయులు, జయంతి, నాగానందప్రసాద్, వెంకటరమణ, బీరే నాగేశ్వరరావు, సంజీవరాయుడు, కరుణాకర్, నారాయణస్వామి, బాలకష్ణ, నాగరాజు రంగస్వామి, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైసిపికి లేదు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



మాట్లాడుతున్న సామకోటి

గత ఐదేళ్ల వైసిపి పాలనలో పది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి, రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన వైసిపికి సిఎం చంద్రబాబుని విమర్శించే అర్హత లేదని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ పలుమార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి, అత్యధిక ధరతో విద్యుత్ కొనుగోలు చేసి, పారిశ్రామికవేత్తలకు కొమ్ము కాచిన వైసిపి ప్రభుత్వం ఇప్పుడు రోడ్డెక్కడం శోచనీయమన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జడ్జి జయలక్ష్మి

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని చేరుకునేందుకు ఇష్టపడి చదవాలని మండల న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు జడ్జి బహుమతులు ప్రదానం చేశారు. సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రతిమ, లోక్ అదాలత్ సభ్యులు లోకేశ్వర్‌రెడ్డి, కె.నరసింహులు, కళాశాల ప్రిన్సిపల్ కె.రమ, ఎంఇఒలు కె.చెన్నకృష్ణ, ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో 'జైన్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కదిరి టౌన్

కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులు

పట్టణంలోని బేరిపల్లిలో ఉన్న జైన్ సిబిఎస్ఈ పాఠశాలలో శనివారం యునైటెడ్ షోడోఖాన్ కరాటే డో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్ షాకిర్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్‌లు నిర్వహించారు. కలర్ బెల్ట్స్‌లో 51మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల హెచ్ఎం జయగుప్తా విద్యార్థులకు కరాటే వల్ల కలిగే లాభాల గురించి తెలిపారు. కరాటేలో జైన్ స్కూల్ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారన్నారు. కరాటే మాస్టర్ షాకిర్, కోచ్ చాందిని, కలర్ బెల్ట్స్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ సాగర్, హై స్కూల్ కోఆర్డినేటర్ ఉమమహేశ్వర్, లోయర్ క్లాస్ కోఆర్డినేటర్ నస్రీన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థినుల చైతన్యంతోనే సమాజమార్పు

ప్రజాశక్తి-బుక్కపట్నం

విద్యార్థినుల్లో చైతన్యం వస్తేనే సమాజానికి మంచి జరుగుతుందని పుట్టపర్తి మహిళా పోలీస్ స్టేషన్ సిఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంజిబి స్కూల్‌లో శనివారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సిఐ మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలపై విద్యార్థినులు చైతన్యవంతంగా ఉండాలన్నారు. బాలికలపై జరుగుతున్న సంఘటనలు, సైబర్ క్రైమ్స్, బాల్య వివాహాల, పోక్సో చట్టం, తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం బాలికల కోసం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చిందని, హెల్ప్ లైన్ నంబర్లను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వరయ్య, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని సుబ్బారావుపేట ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి గ్రామసభ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే అధికారులకు దృష్టికి తీసుకురావాలన్నారు. మట్కా, పేకాట, మద్యం, తదితర అసాంఘిక కార్యక్రమాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో, గ్రామ సచివాలయ మహిళా పోలీస్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ సైకిళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జెండా ఊపి చెత్త సేకరణ సైకిళ్లను ప్రారంభిస్తున్న అధికారులు

వీధి వీధికి వెళ్లి చెత్త సేకరించే సైకిళ్లు, తోపుడు బండ్లను శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, కమిషనర్ ప్రహ్లాద పచ్చజెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందికి అనువుగా ఉండేలా ప్రభుత్వం చెత్త సేకరణ వాహనాలను మంజూరు చేసిందన్నారు. మున్సిపల్ కార్మికులు ప్రతి వీధికి వెళ్లి చెత్త సేకరించి పట్టణాన్ని శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ శివయ్య, కార్యాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

గొట్లూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని గొట్లూరు గ్రామంలో శనివారం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిడిమామిడి విష్ణు నారాయణ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో అనంతపురంలోని కిమ్స్ సవీరా వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. విష్ణునారాయణ మాట్లాడుతూ గుండె జబ్బుల సమస్యలు ఎదురుకొంటున్న ప్రజలకు తన వంతు సాయం చేసేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం-చిగిచెర్ల రైల్వే స్టేషన్ల మధ్యలో ఓ రైల్వే బ్రిడ్జి వద్ద శనివారం గుర్తుతెలియని పురుషుడి శవాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. అతడి వయస్సు 70 ఏళ్లు ఉంటుందని, ఐదు అడుగులకు పైగా ఎత్తు, చామనఛాయ రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు ధర్మవరం రైల్వేపోలీస్ స్టేషన్ 9440627640, 98667 15093లో సమాచారం ఇవ్వాలన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం బత్తలపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు.. ధర్మవరం పట్టణానికి చెందిన ఆదర్శ్, ఆదిత్యానారాయణ సోదరులు. వీరు తాడిపత్రి సమీపంలోని ఆలూరు కోనలో వెలసిన రంగనాయకులుస్వామి ఆలయంలో బంధువుల చిన్నారి కేశఖండన కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. తిరుగు ప్రయాణంలో బత్తలపల్లి వద్ద వెళ్తుండగా బత్తలపల్లికి చెందిన వడేడ రామాంజనేయులు ద్వి చక్రవాహంపై రోడ్డును క్రాస్ చేస్తూ ఢీ కొన్నారు. ఈ సంఘటనలో ఆదర్శ్, రామాంజనేయులు తీవ్రంగా గాయపడగా ఆదిత్యానారాయణకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు ఆటోలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.